ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తావిభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ 25.06.2024 సమయం 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.
2. జూనియర్ డాక్టర్ల నిరవధిక సమ్మె ఈ రోజు కూడా కొనసాగుతోంది. ఈ కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది.
3. రాష్ట్రంలో శాంతి భద్రతలు గత ఆరు నెలల్లో క్షీణించాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలనపై ఇంకా పట్టు రాలేదని BJP ఆరోపించింది.
4. 18వ లోక్ సభకు స్పీకర్ అభ్యర్థిగా అధికార ఎన్డీఏ నుంచి ఓం బిర్లా, ప్రతిపక్ష ఇండీ కూటమి నుంచి కాంగ్రెస్ ఎంపీ కె. సురేశ్ ఈ రోజు నామినేషన్లు దాఖలు చేశారు.

మాదక ద్రవ్యాలు-భట్టి విక్రమార్క

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు తమ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ జల విహార్ వద్ద రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విక్రమార్క పాల్గొన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన ర్యాలీని ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం విష ప్రయోగం లాంటిదని, ఇది. కుటుంబ వ్యవస్థలను విచ్ఛిన్నం చేస్తుందని అన్నారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్న సంఘ విద్రోహ శక్తుల చేతిలో యువత జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో వీటి నిర్మూలనకు నార్కోటిక్ బ్యూరోకు ఎంత బడ్జెట్ అయినా కేటాయిస్తామని విక్రమార్క తెలిపారు. పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా ప్రజల నుంచి కూడా ఈ విషయంలో సహకారం అందాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాతి కుమారి, డీజీపీ రవిగుప్తా పాల్గొన్నారు.

(డెస్క్)

జూడాల సమ్మె

రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు జూనియర్ డాక్టర్ల సమ్మె కొనసాగుతోంది. ఈ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో సాధారణ ఆరోగ్య సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తమ స్టైఫండ్లను సక్రమంగా చెల్లించే వ్యవస్థ, మెరుగైన హాస్టల్ సదుపాయాలు, ఆసుపత్రి ఆవరణలో భద్రతా వంటి అంశాలను జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. అత్యవసర సేవలు మినహా ఓపీ, ఐపీ సేవలకు దూరంగా ఉంటున్నారు. ఎంబీబీఎస్, పీజీ

విద్యార్థులు గాంధీ, ఉస్మానియా, వరంగల్ లోని కాకతీయ కళాశాలలతో పాటు రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలల ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్నారు. కాగా, సమ్మె చేస్తున్న జూనియర్ డాక్టర్లతో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నిన్న జరిపిన చర్చలు అసంపూర్ణంగా ముగిశాయి.

డెస్క్/పిటిసి వరంగల్, హన్మకొండ

BJP-శాంతి భద్రతలు:

రాష్ట్రంలో శాంతి భద్రతలు గత ఆరు నెలల్లో క్షీణించాయని BJP ఆరోపించింది. BJP రాష్ట్ర ఉపాధ్యక్షులు NVSS ప్రభాకర్ హైదరాబాద్ లో ఈరోజు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పాలనపై ఇంకా పట్టు రాలేదని విమర్శించారు. పెద్ద సంఖ్యలో నాలుగు సార్లు IAS, IPS మూకుమ్మడి బదిలీలు జరిగాయని, దీనివల్ల ఏ అధికారికీ ఏ శాఖపై పట్టు లేదని అన్నారు. పార్టీపై కూడా ముఖ్యమంత్రికి పట్టు లేదని, తన మనుగడ కోసం 11 సార్లు ఢిల్లీ పర్యటించారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలపై విచారణలను నిలువరించేందుకే చేరికల పేరిట కాంగ్రెస్-BRS కలిసి పని చేస్తున్నాయని ప్రభాకర్ ఆరోపించారు. కాగా, గతంలో దేశంలో ఎమర్జెన్సీ విధింపును, దాని ప్రతికూల ప్రభావాన్ని గుర్తు చేసుకుంటూ, BJP రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు బ్లాక్ డే గా పాటిస్తోంది.

(MSL)

బోనాలు-పొన్నం ప్రభాకర్:

హైదరాబాద్ లో బోనాల ఉత్సవాల కోసం ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను

ఆదేశించారు. హైదరాబాద్ లో ఈ ఉదయం బల్కం పేట ఎల్లమ్మ ఆలయంలో కళ్యాణోత్సవం ఏర్పాట్లపై మంత్రి వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. బల్కంపేట దేవాలయంలో అమ్మవారి కళ్యాణం ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో వచ్చే ప్రజల కోసం సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని 20 కోట్ల రూపాయిలు కేటాయించిందని అన్నారు. ఈ సమీక్షకు GHMC మేయర్ గద్వాల విజయ లక్ష్మి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

(MSL)

జీవన్ రెడ్డి

తనకు సమాచారం ఇవ్వకుండా తమ జిల్లాకే చెందిన జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ని కాంగ్రెస్ పార్టీలో చేరుకోవడంపై ఆ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీ నిర్ణయానికి నిరసనగా తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే పార్టీ మారే ఆలోచన ఇప్పటివరకు అయితే లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు ఆయన ఇంటికి వెళ్లి బుజ్జగించే ప్రయత్నాం చేశారు.

(డెస్క్)

హుస్నాబాద్ -మెగా జాబ్ మేళ

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిన్న నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. ఈ జాబ్ మేళా

కోసం 8 వేల 795 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా.. దాదాపు 60 కి పైగా జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు మెగా జాబ్ మేళా లో పాల్గొన్నాయని. దాదాపు 13 వందల 10 మంది నిరుద్యోగులకు తక్షణమే ఆర్డర్ కాపీలు ఇచ్చి ఉద్యోగాలు పొందినట్లు అధికారులు తెలిపారు. మరో 3 వేల 887 మంది షార్ట్ లిస్ట్ చేశారు.

(సిద్దిపేట జిల్లా పీటీసీ)

ఖమ్మం-సత్తుపల్లి ఎమ్మెల్యే

ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు భూ నిర్వాసితులకు 10 కోట్ల రూపాయల నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి విలేకరుల సమావేశంలో చెప్పారు. సీతారామ ప్రాజెక్టు పరిధిలోని సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామ భూనిర్వాసితులు 100 మందికి ఈ పరిహారం అందిస్తుందని వివరించారు. నిధుల మంజూరుకు కృషిచేసిన రాష్ట్రమంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, పొంగు లేటి శ్రీనివాసరెడ్డిలకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

(PTC, khammam)

జనగామ-మానవ రహిత సబ్ స్టేషన్లు

మానవ రహిత విద్యుత్ సబ్ స్టేషన్ల నిర్వహణ దిశగా ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) నూతన టెక్నాలజీని పైలెట్ ప్రాజెక్టుగా జనగామ జిల్లాలో అమలు చేయనుంది. ఇందుకు జిల్లాలోని నిడిగొండ, స్టేషన్ ఘన్పూర్ లోని చిన్న పెండ్యాల సబ్ స్టేషన్ లను ఎంచుకుంది. జిల్లాలో ఎన్ పీడీసీఎల్ పరిధిలోని అన్ని 33 బై 11 కేవీ సబ్ స్టేషన్లు, 33 బై 11 కెవి ఫీడర్లకు రియల్ టైం మానిటరింగ్ అండ్ కంట్రోలింగ్ టెక్నాలజీని తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ కొత్త టెక్నాలజీ వల్ల సబ్ స్టేషన్లలో లోడ్, పవర్ ఫ్యాక్టర్, ట్రిప్పింగ్ లు, బ్రేక్ డౌన్లు, ఎల్ సీలు ఎలా జరిగాయో పూర్తిగా సమాచారం తెలుసుకోవడం వీలవుతుంది.

ఈ కొత్త టెక్నాలజీ అమలుపరచడానికి పైలెట్ ప్రాజెక్టు కింద స్కోప్, స్పైండర్ అనే కంపెనీలకు స్టేషన్ ఘన్ పూర్ లోని చిన్న పెండ్యాల, నిడిగొండ లోని రెండు సబ్ స్టేషనలో ప్రయోగం చేయనున్నారు.

(పిటిసి జనగామ జిల్లా)

EVE. LS-OATH

లోక్ సభ స్పీకర్ గా బీజేపీ ఎంపీ ఓం బిర్లాకు మరోసారి అవకాశం ఇవ్వాలని అధికార ఎన్డీఏ నిర్ణయించింది. 18వ లోక్ సభకు తమ స్పీకర్ అభ్యర్థిగా ఓం బిర్లా పేరును ప్రకటించింది. దాంతో బిర్లా ఈ రోజు తన నామినేషన్ దాఖలు చేశారు. ప్రతిపక్ష ఇండీ కూటమి నుంచి కాంగ్రెస్ ఎంపీ కె. సురేశ్ కూడా నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు లోక్ సభ రెండో రోజు సమావేశాలు కొనసాగుతున్నాయి. కొత్తగా ఎన్నికైన లోక్ సభ సభ్యులతో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రమాణ స్వీకారం చేయిస్తున్నారు.

(ఎన్.ఎస్.డి.)

సంగారెడ్డి-కలెక్టర్

సంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ ,మున్సిపల్, పంచాయతీ రాజ్ ,ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. కలెక్టరేట్ లో ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ జిల్లాలో గుంట భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఖాళీ స్థలాలను గుర్తించి వాటి చుట్టూ కంచె, బోర్డులు ఏర్పాటు చేయాలని , అధికారులను ఆదేశించారు.

(పీటీసీ, సంగారెడ్డి)

కరీంనగర్-సీజన్ వ్యాధులు

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిన్న రాత్రి సీజనల్ వ్యాధులను నియంత్రణపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీల్లో శానిటేషన్ ప్రక్రియ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

(పిటిసి, కరీంనగర్)